

వ్యవసాయాభివృద్ధిపై అవగాహన

వ్యవసాయాభివృద్ధిపై అవగాహన పెంచుకోవడం అవసరమని రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సత్యనారాయణ అన్నారు. 8లో



'పవర్'ఫుల్ టెక్నాలజీ 8లో

విద్యుత్ సరఫరాలో సమస్యలను అధిగమించేందుకు ఏపీఈపీడీసీఎల్ నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తోంది.



విత్తన బంతులతో..

విత్తన బంతులతో విశాఖను హరిత వనం చేద్దామని జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పిలుపునిచ్చారు. 8లో

న్యూస్‌రీల్

పొల్లూరుకు పర్యాటకుల తాకిడి



పొల్లూరు జలపాతం వద్ద పర్యాటకుల సందడి

మోతుగూడెం: పొల్లూరు వాటర్ ఫాల్స్‌కు పర్యాటకుల తాకిడి పెరిగింది. వరుసగా మూడు రోజుల సెలవులు రావడంతో రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులతో ఈ ప్రాంతంలో సందడి నెలకొంది. మోతుగూడెం, డొంకరాయి పరిసర ప్రాంతాల్లో ఉదయం నుంచి మంచు కురుస్తుండడంతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించేందుకు పర్యాటకులు పోటెత్తారు. వాటర్ ఫాల్స్ వద్ద తగు జాగ్రత్తలు పాటిస్తూ పర్యాటకులు మధురానుభూతిని పొందారు.

ప్రకృతి సాగు పద్ధతిలో విధానాలపై అధ్యయనం



కాఫీ తోటల్లో అధ్యయనం చేస్తున్న అమెరికాకు చెందిన మిగుల్ గంబో

జి.మాడుగుల: మండలంలోని ఎం.నిట్టాపుట్టు యూనిట్‌లో ప్రకృతిసాగులో రైతులు పాటించే విధానాలపై అమెరికా దేశానికి చెందిన మిగుల్ గంబో సోమవారం అధ్యయనం చేశారు. కాఫీ, మిరియాల సాగులో పాటిస్తున్న పద్ధతులను రైతు సాధికార సంస్థ ప్రాజెక్టు మేనేజర్ డీపీఎం భాస్కర్, రెయిన్ ఫారెస్ట్ అధికారి వినూత్న, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ భాస్కర్, ఎఫ్‌పీవో సీఈవో గంగరాజు, యూనిట్ ఇన్‌చార్జి ప్రసాద్, ప్రతినిధి నీలకంఠంనాయుడు తదితరులు సాగు పద్ధతులను సోదాహరణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో వాసన్ సంస్థ ప్రతినిధులు సన్ని, రాజప్రకాష్, నాగేంద్రప్రసాద్, మండల ఇన్‌చార్జి జె.వెంకట్, పాడేరు మండల యూనిట్ ఇన్‌చార్జిలు జానకి, సన్నిబాబు, నీలకంఠం, బుజ్జిబాబు గడుతూరు యూనిట్ ఇన్‌చార్జి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు సహకరించాలి



వేసిన చిత్రాలతో విద్యార్థులు

ఆరిలోవ(విశాఖ): వన్యప్రాణుల సంరక్షణకు అందరూ సహకరించాలని సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి సూచించారు. సోమవారం జూ పార్కులో వన్యప్రాణి వారోత్సవాలను జూ క్యూరేటర్ నందనీ సలారియాతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కలిగించడానికి ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 8 వరకు జరగనున్న ఈ వారోత్సవాల్లో పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో సీపీఈ జూనియర్ కళాశాల ప్రతినిధులు, సిబ్బంది ఇక్కడ జంతువుల సంరక్షణ కోసం రూ.40 వేల చెక్కును సీసీఎఫ్‌కు అందజేశారు. ఆయా చిన్నారులు వేసిన చిత్రాలను ప్రదర్శించారు.

నేటి నుంచి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పర్యటన

సాక్షి, విశాఖపట్నం : కేంద్ర సమాచార శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మంగళవారం నుంచి 3 రోజుల పాటు విశాఖలో పర్యటించనుంది. కమిటీ చైర్‌పర్సన్ ప్రతాప్‌రావ్ జాదవ్ అధ్యక్షతన 20 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ సభ్యులతో కూడిన బృందం మంగళవారం నగరానికి చేరుకోనుంది. పర్యటనలో భాగంగా బీఎస్ఎన్ఎల్, రైల్‌టెల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, భారతీ ఎయిర్‌టెల్, భారతీ ఎక్సాకామ్, రిలయన్స్, జియో సంస్థల ప్రతినిధులతో సమావేశం కానున్నారు. యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్ పథకం కింద ఆయా సంస్థలు అమలు చేస్తున్న వ్యూహాల గురించి సమీక్ష నిర్వహించనున్నారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ(మైటీ), హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ టెస్ట్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రతినిధులతో సమావేశం కానున్నారు.



పాడేరులో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



ఎల్లవరంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి



ముంచంగిపుట్టులో నివాళులర్పిస్తున జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ఓ మహాత్మా.. ఓ మహర్షి

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా గాంధీ జయంతి
- నివాళులర్పించిన నాయకులు, అధికారులు, ప్రజలు

అహింసా మార్గంలో అలుపెరగని పోరాటం చేసి, దేశ దాస్య శృంఖలాలను తెంచిన మహాత్మునికి జిల్లా ప్రజలు సోమవారం శ్రద్ధాసక్తులతో నివాళులర్పించారు. వాడవాడలా జయంతిని ఘనంగా నిర్వహించి జాతిపితను స్మరించుకున్నారు. మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ మార్గం ఎన్నటికీ అనుసరణీయమని, ఆ బోసి నవ్వుల ధీరోదాత్తుడి ఆశయసాధనకు అందరూ కృషి చేయాలని పలువురు తెలిపారు. ఆయన మళ్లీ భూమ్మీదకి రావాలని ఆకాంక్షించారు. అరకులోయ గిరిజన మ్యూజియం వద్ద గాంధీ విగ్రహానికి కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, పలువురు అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాడేరులో ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, అడ్డతీగల మండల ఎల్లవరంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ముంచంగిపుట్టులో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర జాతిపితకు నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



అరకులోయలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, అధికారులు

నేడు, రేపు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రజిని పర్యటన

4న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు ప్రారంభం



సాక్షి,పాడేరు: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఈనెల 3,4 తేదీల్లో అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ మండలాల్లో పర్యటించనున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలుజేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ఆమె ప్రారంభిస్తారు. మంత్రి పర్యటన ఏర్పాట్లలో పోలీసు, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖల అధికారులు నిమగ్నమయ్యారు. 3వతేదీ మధ్యాహ్నం విశాఖపట్నం నుంచి రోడ్డు మార్గంలో మంత్రి బయలుదేరి అనంతగిరిలోని టూరిజంశాఖకు చెందిన హరితవేలి రిసోర్ట్‌కు మధ్యాహ్నం 3.30 గంటలకు చేరుకుంటారు. సాయంత్రం 5.30 వరకు అక్కడే మంత్రి ఉంటారు. అనంతరం అక్కడ నుంచి అరకులోయకు బయలుదేరుతారు. సాయంత్రం 6.30గంటలకు అరకులోయ రైల్వే గెస్ట్‌హౌస్‌కు చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు. మరుసటి రోజు బుధవారం ఉదయం డుంబ్రిగుడ మండలంలో పర్యటిస్తారు. జైపూర్ రోడ్డు జంక్షన్‌లోని కిల్లోగూడ గిరిజన సంక్షేమ బాలికల ఇంగ్లిషు మీడియం ఆశ్రమ పాఠశాలను ఉదయం 10.30 గంటలకు సందర్శిస్తారు. ఈ పాఠశాలలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించి, వైద్య సేవలను పర్యవేక్షిస్తారు. అనంతరం 11.30గంటలకు అరకులోయ మండలం యండపల్లివలసలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలకు చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష ఆరోగ్యశిబిరాన్ని మంత్రి ప్రారంభించి, పర్యవేక్షిస్తారు.అనంతరం మధ్యాహ్నం 12.30గంటలకు రోడ్డు మార్గంలో మంత్రి విశాఖపట్నానికి తిరిగి ప్రయాణమవుతారు.

పినతల్లి ఘాతుకం

- పీక నులిమి మూడేళ్ల చిన్నారి హతం
- నరియాపల్లి గ్రామంలో ఘటన



హర్షిణి గొంతుపై ఉన్న రాయి



రోదిస్తున్న బంధువులు

ముంచంగిపుట్టు: మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ నరియాపల్లిలో దారుణం చోటు చేసుకుంది. ముద్దులొలికే మూడేళ్ల పాపను పిన తల్లి కనికరం లేకుండా పీక నులిమి, గొంతుపై బండ రాయి పెట్టి కాలితో నొక్కి కర్కశంగా హత్య చేసింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నరియాపల్లి గ్రామానికి చెందిన వంతాల భాస్కరరావు 2011లో అరడకోట పంచాయతీ నిమ్మగుంట గ్రామానికి చెందిన పాంగి శాంతిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం. మొదటి సంతానం బాబు కాగా, రెండో కాన్పులో పాప హర్షిణి పుట్టింది. హర్షిణి పుట్టిన మూడు నెలలకే శాంతి అనారోగ్యంతో చనిపోవడంతో అప్పటి నుంచి నాన్నమ్మే వారి ఆలనాపాలనా చూసింది. 2021 సంవత్సరంలో చింతపల్లి మండలం కుడుముసారా పంచాయతీ కాకరపల్లి గ్రామానికి చెందిన గెమ్మెలి నీలమ్మను భాస్కరరావు రెండో పెళ్లి చేసుకున్నాడు. పెళ్లి చేసుకున్న కొద్ది రోజులు నీలమ్మ బాగానే ఉంది. ఆమెకు పాప పుట్టిన తరువాత మొదటి భార్యకు పుట్టిన పిల్లలను ఇబ్బంది పెట్టడం మొదలు పెట్టింది. మొదటి భార్యకు పుట్టిన బాబును భాస్కరరావు నిమ్మగుంటలో బంధువుల ఇంట్లో ఉంచి చదివిస్తున్నాడు. ఈ నెల 1 తేదీన భాస్కరరావు వేరే గ్రామానికి వెళ్లడంతో నీలమ్మ గ్రామ సమీపంలో కొండపై నిర్మానుష్య ప్రదేశానికి పాప హర్షిణి తీసుకువెళ్లి కిందపడేసి గొంతునొక్కడంతో స్పృహ కోల్పోయింది. ఇంకా పాపప్రాణాలతోనే ఉండడంతో బండరాయిని గొంతుపై వేసి కాలితో బలంగా తొక్కడంతో చనిపోయింది. మరణించిందని నిర్ధారించుకున్న తరువాత నీలమ్మ ఇంటికి తిరిగి వచ్చింది. పాప తండ్రి భాస్కరరావు ఇంటికి వచ్చేసరికి కుమార్తె లేకపోవడంతో భార్యను అడిగాడు. ఆమె సరిగా సమాధానం చెప్పకపోవడంతో గట్టిగా నిలదీశాడు. పాపను తీసుకుని ఆదివారం మధ్యాహ్నం కొండ మీదకు వెళ్లిందని చుట్టుపక్కల వారు చెప్పడంతో ఆ ప్రాంతానికి వెళ్లి గాలించగా పాప అచేతనంగా పడి ఉండడాన్ని చూసి తండ్రి, బంధువులు రోదించారు. తానే చంపానని నీలమ్మ అంగీకరించింది. దీంతో భాస్కరరావు ముంచంగిపుట్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హర్షిణిమృతదేహాన్ని ముంచంగిపుట్టుకు తరలించగా, వైద్యులు పరిశీలించారు. ఎస్‌ఐ రవీంద్ర కేసునమోదు చేశారు. నిందితురాలిని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, వేదికపై అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

అరకులోయ రూరల్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. అరకులోయలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో సోమవారం అరకులోయ, డుంబ్రిగుడ మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల పార్టీ అధ్యక్షులు, కో–ఆప్షన్ సభ్యులు, ముఖ్యనాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వాలు అమలు చేయని విధంగా వైఎస్సార్‌సీపీ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేస్తోందని చెప్పారు. పథకాలపై విస్తృతంగా ప్రచారం చేసి పార్టీ విజయానికి కృషి చేయాలని తెలిపారు. ప్రతిపక్షాలు ఎటువంటి తప్పుడు ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మడం లేదని చెప్పారు. మనం చేసిన మంచి, గత టీడీపీ ప్రభుత్వం చేసిన తప్పులను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసిన వారికి సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు ప్రజలకు వివరిస్తూ ప్రతి కార్యకర్తా నాయకుడిగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాజరమేష్, జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, అరకులోయ, డుంబ్రిగుడ ఎంపీపీలు ఈశ్వరి, ఉషారాణి, వైస్ ఎంపీపీలు రామన్న, సుమంజల్లి, ఆనద్, లలిత, పార్టీ మండల అధ్యక్షులు మల్లేష్, లక్ష్మణ్‌కుమార్, మండల కన్వీనర్లు సంపత్‌కుమార్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి



శ్రీవారి సన్నిధిలో వేదప్రకాష్ దంపతులు

కొమ్మాది(విశాఖ): రుషికొండలో గల శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామిని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి వేద ప్రకాష్ సోమవారం శ్రీవారిని దర్శించుకున్నారు. ముందుగా ఆయన అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు ప్రసాదాన్ని అందజేశారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యానికి భద్రత



చీపురుతో చెత్తను ఊడుస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తదితరులు

కలెక్టర్ సుమిత్ కుమార్

అరకులోయ రూరల్: పరిసరాల పరిశుభ్రంతోనే ఆరోగ్య భద్రత ఉంటుందని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభా సోమేశ్వరి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. గిరిజన సహకార సంస్థ కార్యాలయం సమీపంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి చీపుళ్లతో చెత్తను ఊడ్చి, శుభ్రం చేశారు. అనంతరం అరకు–పాడేరు ప్రధాన రహదారిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని గ్రామ స్థాయి నుంచి ధృడసంకల్పంతో నిర్వహించాలన్నారు. ప్రతి పౌరుడు ఈ కార్యక్రమంలో భాగస్వామికావాలని తెలిపారు. పరిసరాల పరిశుభ్రంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత కూడా పాటించాలని చెప్పారు.

ప్లాస్టిక్ నిషేధం అమలుకు సహకరించాలి

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధం అమలుకు అందరూ సహకరించాలని కోరారు. పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ సామగ్రి విక్రయం, కొనుగోలును మానుకోవాలని తెలిపారు. గిరిజన ప్రాంతంలో స్వచ్ఛమైన వాతవరణం ఉందని, ప్లాస్టిక్ వినియోగించి కలుషితం చేయవద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కిల్లో రాజరమేష్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, ఎంపీపీ ఉషారాణి, వైస్ ఎంపీపీలు రామన్న, సుమంజల్లి, మండల కన్వీనర్ సంపత్‌కుమార్, నాయకులు రంజిత్‌కుమార్, సాంబ,యాసిన్, శెట్టి వెంకటరావు, గాసి,నర్సింగ్, గోపాల్ ,రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతపై స్పెషల్ ప్రోగ్రామ్

- ఈపీడీసీఎల్ పరిధిలో ప్రతి నెలా 2వ తేదీన నిర్వహించేందుకు ప్రణాళిక
- ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రచార రథం
- ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ వెల్లడి

సాక్షి, విశాఖపట్నం : నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు ప్రమాదాలను అరికట్టేందుకు విద్యుత్ భద్రత అంశాలపై అవగాహన కార్యక్రమాలను గాంధీ జయంతి పురస్కరించుకొని ఇకపై ప్రతినెలా 2వ తేదీన క్రమం తప్పకుండా నిర్వహిస్తామని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ప్రకటించారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన విద్యుత్ భద్రత అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీఎండీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ భద్రత అవగాహన రథాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. సంస్థ సిబ్బందితో క్షేత్రస్థాయి నుంచి అధికారుల వరకు ప్రతీ ఒక్కరూ భద్రతాసూచనలను తప్పకుండా ఆచరిస్తామని విశాఖ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎల్.మహేంద్రనాథ్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సీఎండీ పృథ్వీతేజ్ మాట్లాడుతూ ఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ ప్రమాదాలను అరికట్టేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించామని ఇందులో భాగంగా సంస్థ పరిధిలోని ఉన్న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్లలోని 11 జిల్లాల వినియోగదారులకు, సిబ్బందికి విడివిడిగా భద్రతా సూచనలు తయారుచేశామన్నారు. ప్రచార రథంతో అవగాహన కల్పించడంతో పాటు భవన నిర్మాణ కార్మికులు, తోటల యజమానులు, రైతు కూలీలు, వాహనాల డ్రైవర్లకు ప్రత్యేకంగా సూచనలను రూపొందించినట్లు వివరించారు. విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబరు 1912 కు ఫోన్ చేయాలని సూచించారు. ఆపరేషన్స్ డైరెక్టర్ బి.రమేష్ ప్రసాద్ మాట్లాడుతూ భద్రత సూచనలకు సంబంధించిన ఆడియోలను తయారు చేసి సంస్థ పరిధిలోని అన్ని సెక్షన్ కార్యాలయాలకు పంపించినట్లు వివరించారు. అనంతరం విద్యుత్ ఉద్యోగులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బి.రమేష్ ప్రసాద్, ఏవీవీ సూర్యప్రతాప్, సీజీఎంలు, ఈఈలు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్లకార్డులతో ప్రచారం చేసే సిబ్బందితో ఈపీడీసీఎల్ సీఎండీ, డైరెక్టర్లు, ఎస్ఈలు

అల్లూరి ఆశయ సాధనకు కృషి

అడ్డతీగల: అల్లూరి సీతారామరాజు ఆశయ సాధన కోసం యువత కృషి చేయాలని, ఆయన స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని ఏపీ విశ్రాంత చీఫ్‌పోస్ట్‌మాస్టర్ జనరల్ ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. అడ్డతీగలలో సోమవారం అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు మాట్లాడుతూ అల్లూరి పేరున నాణాన్ని విడుదల చేయాలని ప్రధాని మోదీని కోరినట్టు చెప్పారు. ఇటీవల గవర్నర్‌చే తపాలాశాఖ విడుదల చేసిన అల్లూరి సీతారామరాజు చరిత్రకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

అల్లూరి సీతారామరాజు యువజన సంఘం జాతీయ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజసాగి సత్యనారాయణరాజు,ఉపాధ్యక్షులుగా పుచ్చల రామకృష్ణ, వేటుకూరి కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శిగా ఇళ్ల శ్రీకాంత్,కార్యదర్శులుగా వెల్లాల నాగార్జున, శ్యామల వరలక్ష్మి,లాక్కాకుల బాబ్జి, సివంగి శ్రీనివాసరావు, రామన శ్రీనివాసరావు, వాడపల్లి శేషాచార్యులు, హరదీపక్, కోశాధికారిగా బళ్లా శ్రీనివాస్,కార్యవర్గ సభ్యులుగా మరో నలుగురు ఎంపికయ్యారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విశ్రాంత చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ వెంకటేశ్వర్లు తదితరులు

సమగ్ర గిరిజనాభివృద్ధే ఐటీడీఏ లక్ష్యం

- మన్యంలో ప్రస్తుతం లక్ష ఎకరాల్లో కాఫీ సాగు
- 12 ఏళ్ల తర్వాత అరకు కాఫీకి బెస్ట్ ఫైన్ కప్ అవార్డు
- విలేకరుల సమావేశంలో ఐటీడీఏ పీవో అభిషేక్



మాట్లాడుతున్న అభిషేక్

పాడేరు రూరల్ : సమగ్ర గిరిజనాభివృద్ధే లక్ష్యంగా ఐటీడీఏ పనిచేస్తోందని, అందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్తున్నామని పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ తెలిపారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు.

అరకు కాఫీకి ప్రపంచ బెస్ట్ ఫైన్ కప్ అవార్డు

సెప్టెంబర్ 25 నుంచి 30 వరకు బెంగళూరులో నిర్వహించిన ప్రపంచ కాఫీ సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున ఐటీడీఏ–జీసీసీ ఆధ్వర్యంలో కాఫీ పెవిలియన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ పెవిలియన్‌లో మనదేశం నుంచి తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలతో పాటు కాఫీ సాగు చేస్తున్న 10 దేశాల ప్రతినిధులు పాల్గొన్నట్టు చెప్పారు. పెదబయలు మండలం లక్ష్మీపేట పంచాయతీ కప్పాడ గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ కాఫీ రైతు కిల్లో అశ్వినీ సాగు చేసిన కాఫీకి బెస్ట్ వాష్డ్ అరాబికా అవార్డు (ఫైన్ కప్ అవార్డు) లభించిందని చెప్పారు. ఏజెన్సీలో కాఫీ రైతులకు మరింత ప్రోత్సాహం అందిస్తున్నట్టు తెలిపారు. 12 ఏళ్ల తరువాత ఈ అవార్డు లభించినట్టు చెప్పారు. 2016లో ఐటీడీఏ ద్వారా కాఫీ సాగును ప్రారంభించామని, ప్రస్తుతం లక్ష ఎకరాలకు టార్గెట్‌కు చేరుకున్నామన్నారు. జీకే వీధి, జి.మాడుగుల మండలాల్లో రూ.7.50 కోట్లతో కాఫీ పల్పింగ్ యూనిట్లు, రూ.40 లక్షలతో డ్రయ్యర్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

గిరిజన విద్యార్థులకు సివిల్స్‌లో ఉచిత శిక్షణ

పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లోని డిగ్రీ పూర్తి చేసుకుని 21ఏళ్ల నుంచి 35ఏళ్ల మధ్య వయసు కలిగిన గిరిజన విద్యార్థులకు సివిల్స్‌లో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఐటీడీఏ ద్వారా రూ.60 లక్షలు వెచ్చించి ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈనెల 3 నుంచి 7వరకు పాడేరు ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను పరిశీలించి 15న మొదటి దశ పరీక్ష నిర్వహించి, 18న ఫలితాలు వెల్లడిస్తామని, 22న రెండో దశ పరీక్ష నిర్వహించి, 24న ఫలితాలు వెల్లడించి 27,28 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి 50 మందిని శిక్షణకు ఎంపిక చేస్తామన్నారు. కనీసం 15 మంది సివిల్స్, గ్రూప్స్‌లో ఉద్యోగాలు సాధించేలా తర్ఫీదు ఇస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని గిరిజన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేలా..

ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. 122 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల నుంచి ఒక్కో పాఠశాల నుంచి సుమారు ముగ్గురు చొప్పున విద్యార్థులను ఎంపిక చేసి ప్రత్యేక పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. అందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 50 మంది విద్యార్థులను ఎంపిక చేసి, పాడేరులోని ఏదైన గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో శిక్షణ ఇస్తామన్నారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు విశాఖపట్నం మారికవలస గిరిజన గురుకులంలో నీట్, ఇంజనీరింగ్, లాసెట్ వంటి ప్రవేశ పరీక్షల్లో శిక్షణ ఇస్తామ న్నారు. విద్యార్థుల్లో పోటీతత్వం నెలకొల్పేందుకు ఇటువంటి ప్రయత్నాలు చేస్తున్నామని,ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

విత్తన బంతి హరిత కాంతి

- హెలికాప్టర్ల ద్వారా విత్తన బంతులు చల్లిన జీవీఎంసీ


నేవీ సిబ్బందికి విత్తన బంతులు అందజేస్తున్న మేయర్ హరివెంకట కుమారి, డిప్యూటీ మేయర్ శ్రీధర్, నేవల్ అధికారి మనీష్‌శర్మ తదితరులు


జెండా ఊపి హెలికాప్టర్లు ప్రారంభిస్తున్న మేయర్, నేవల్ అధికారులు

దాబాగార్డెన్స్: అడవులు సహజ సిద్ధంగా తయారు కావాలి. గుంతలు తవ్వి, మొక్కలు నాటి అడవులు సృష్టించడం అసాధ్యం. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన అడవి జీవవైవిధ్యానికి అద్దం పడుతుంది. ఇలాంటి అడవులను సృష్టించేందుకు జీవీఎంసీ కృషి చేస్తోంది. ఒకవైపు మొక్కలు నాటుతూనే మరోవైపు నగరంలో ఏడు కొండలపై సీడ్ బాల్స్ విసిరి మొక్కలు పెంచే కార్యక్రమానికి ఈస్టర్న్ నేవల్ కమాండ్, గ్రీన్ క్లైమేట్ సంస్థ సహకారంతో జీవీఎంసీ శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాన్ని సోమవారం ఐఎన్ఎస్ డేగా వద్ద నేవల్ అధికారి మనీష్‌శర్మతో కలిసి మేయర్ హరివెంకటకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. 4 హెలికాప్టర్ల ద్వారా సుమారు 6 లక్షల విత్తనాలను సేకరించి నగరంలోని పావురాల కొండ 1, 2, కాపులుప్పాడ, సింహాచలం, పార్లుపాలెం కొండ, వేదుళ్లనరవ కొండ, యారాడ కొండలపై విడుదల చేసినట్లు మేయర్ తెలిపారు. విత్తన బంతులతో విశాఖను హరిత వనం చేద్దామని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, హార్టికల్చర్ డీడీ దామోదర్, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ పలువురు జీవీఎంసీ అధికారులు, నేవల్ అధికారులు, గ్రీన్‌క్లైమేట్ సంస్థ ప్రతినిధి జేవీ రత్నం పాల్గొన్నారు.


కొండలపై విత్తనాలు వేసేందుకు సిద్ధంగా ఉన్న హెలికాప్టర్లు


హెలికాప్టర్ల వద్దకు విత్తన బంతులు తీసుకెళ్తున్న సిబ్బంది

‘పవర్’ఫుల్ టెక్నాలజీ

- కరెంట్ పోతే.. క్షణాల్లోనే పునరుద్ధరణ
- ఆటోమేటిక్‌గా ఫీడర్ చేంజ్ చేసే సాంకేతికత
- ఈపీడీసీఎల్ పరిధిలో తొలిసారిగా అమలు
- సప్లై నిలిచిపోతే గతంలో 10 నిమిషాల సమయం
- ప్రోగ్రామింగ్ ద్వారా ఇప్పుడు 90 సెకెన్లలోనే ఫీడర్ మార్పు
- అవుటర్ హార్బర్‌లోని 33కేవీ సబ్ స్టేషన్‌లో పైలట్ ప్రాజెక్టుగా ఏర్పాటు


ఆటోమేటిక్ ఫీడర్ చేంజ్ రూమ్

సాక్షి, విశాఖపట్నం : ఆధునిక సాంకేతికత అన్ని రంగాల్లో విస్తరిస్తోంది. ఇదే విధానాన్ని అందిపుచ్చుకుంటోంది ఏపీఈపీడీసీఎల్. విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న సమస్యలను అధిగమించడంతో పాటు పని విధానాన్ని సులభం చేసుకుంటోంది. విద్యుత్ సరఫరాకు నూతన సాంకేతికను జతచేస్తూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడంతో పాటు సరఫరా నిలుపుదల అంతరాయాన్ని తగ్గించేలా ఆటోమేషన్‌పరిజ్ఞానంతో సబ్‌స్టేషన్ల నిర్వహణను సులభతరం చేసుకుంటోంది. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో తొలిసారిగా మానవ తప్పిదాలకు ఆస్కారం లేకుండా నిమిషాల వ్యవధిలోనూ సరఫరా పునరుద్ధరించేలా అవుటర్ హార్బర్‌లో ఉన్న సబ్‌స్టేషన్‌ను ఆటోమేటెడ్ సబ్‌స్టేషన్‌గా మార్చి పైలట్ ప్రాజెక్టు విజయవంతంగా నిర్వహిస్తోంది.

విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ, ప్రసార నష్టాలను తగ్గించడంలో ఎప్పటికప్పుడు ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్న ఏపీఈపీడీసీఎల్ వినియోగదారులకు మరింత నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసే విషయంలో రాజీ పడటం లేదు. ఇందులో భాగంగానే.. సబ్‌స్టేషన్ల ఆటో అప్‌డేషన్‌పై దృష్టిసారించింది. పైలట్ ప్రాజెక్టుగా విశాఖపట్నం ఆపరేషన్ సర్కిల్ పరిధిలోని అవుటర్ హార్బర్ సమీపంలో ఉన్న 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ ఎంపిక చేశారు. ఎస్ఈ మహేంద్రనాథ్ ఆధ్వర్యంలో డిప్యూటీ ఈఈ ఉదయ్‌కిరణ్ బృందం ఈ పనికి ఉపక్రమించింది.

ఏం జరుగుతుందంటే.??

ఇన్నాళ్లూ ఇక్కడ ఉన్న 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు 132 కేవీ సబ్ స్టేషన్ ఫీడర్ ద్వారా సప్లై వస్తోంది. ఏదైనా సమస్య తలెత్తి.. ట్రిప్ అయితే రెండో 33/11 కేవీ సబ్ స్టేషన్ ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తుంటారు. ఇన్నాళ్లూ విద్యుత్ సరఫరా నిలిచిపోయిన వెంటనే ఇద్దరు వ్యక్తులు ఆ సబ్‌స్టేషన్‌ను ర్యాక్ అవుట్ చేయడం, రెండో ఫీడర్ వద్దకు వెళ్లి సప్లై చేంజ్ చేయడం ఆ తర్వాత తిరిగి మళ్లీ సబ్‌స్టేషన్ ఆన్ చేసి.. సరఫరా పునరుద్ధరణ చేసేవాళ్లు. దీనికి 5 నుంచి 10 నిమిషాల సమయం పట్టేది. ప్రోగ్రామింగ్ డిజైన్ చేయడం వల్ల ఒక ఫీడర్‌లో సరఫరా ఆగిపోతే మరో ఫీడర్‌ను అనుసంధానించేందుకు మానవ సహకారం లేకుండా.. కేవలం 60 నుంచి 90 సెకెన్ల వ్యవధిలోనే జరిగిపోతుంది. అంటే ఈ సబ్ స్టేషన్ పరిధిలో ట్రిప్ అయి కరెంట్ పోతే కేవలం 90 సెకన్లలోనే విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలో 9 వేల మంది హెచ్‌టీ, ఎల్‌టీ వినియోగదారులతో పాటు, రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, నాలుగు 11కేవీ ఫీడర్లు ఉన్నాయి. ఆటోమేటెడ్ అప్‌డేషన్ వల్ల 9 వేల మంది వినియోగదారులకు విద్యుత్ సరఫరా మరింత నాణ్యంగా అందుతోంది.

అక్కడా ఇబ్బంది తలెత్తితే..?

సాంకేతికత సహకారంతో ఫీడర్ చేంజింగ్ నిర్వహిస్తుంటారు. ఒకవేళ ఈ టెక్నాలజీలో ఏదైనా సమస్య తలెత్తితే దానిని కూడా అధిగమించేలా వ్యవస్థను ఇంజినీర్లు రూపొందించారు. ఈ టెక్నాలజీని స్కాడాకు అనుసంధానం చేశారు. మొత్తం వ్యవస్థను స్కాడా కంట్రోల్‌రూమ్ నుంచి షిఫ్ట్ ఆపరేటర్లు పర్యవేక్షిస్తుంటారు. ప్రోగ్రామింగ్ లాజిక్‌లో పొరపాటు జరిగి నిలిచిపోతే స్కాడాలో అలెర్ట్ చూపిస్తుంది. దీన్ని గమనించి అక్కడి నుంచే ఫీడర్‌ను నిమిషంన్నర వ్యవధిలో మార్చవచ్చు.

ప్రమాదాలు తలెత్తకుండా..

33 కేవీ ట్రిప్ అయితే రెండో ఫీడర్ నుంచి సప్లై తీసుకున్న సమయంలో ఒకేసారి సరఫరా ఎక్కువైతే ఫీడర్ల వద్ద ప్రమాదాలు తలెత్తే అవకాశం ఉంది. అందుకే ఒక సప్లై తీసుకున్నప్పుడు 11 కేవీ ఫీడర్‌ను కూడా ట్రిప్ చేసేలా డిజైన్ చేశారు. దీని వల్ల ప్రమాదాలు జరిగే అవకాశమే లేదు. రెండో ఫీడర్ నుంచి సప్లై తీసుకున్నప్పుడు సరఫరా పునరుద్ధరణ చేసిన సమయంలో పాత ఫీడర్‌కు వెంటనే మార్చకుండా సంయమనం పాటిస్తారు. ఎందుకంటే ఈ ఫీడర్ మార్చేందుకు కనీసం నిమిషం నుంచి 2 నిమిషాల సమయం పడుతుంది. దీని వల్ల వెంటవెంటనే పవర్ కట్ అయ్యిందనే విమర్శలు వినియోగదారుల నుంచి వస్తుంటాయి. ఇది తలెత్తకుండా జాగ్రత్త వహిస్తున్నారు.


ఔటర్ హార్బర్ సబ్‌స్టేషన్

రూపాయి ఖర్చు లేకుండా..

నెల రోజుల వ్యవధిలోనే సాధారణ సబ్‌స్టేషన్‌ను ఆటోమేటెడ్ సబ్‌స్టేషన్‌గా ఇంజినీరింగ్ అధికారులు తీర్చిదిద్దారు. ఉన్న వనరులను వినియోగించుకుంటూ రూపాయి ఖర్చు చేయకుండా టెక్నాలజీ సాయంతో సబ్‌స్టేషన్ పనితీరుని పూర్తిగా మార్చేశారు. ప్రోగ్రామింగ్ డిజైన్ చేసి ఫీడర్‌ను ఆటోమేటిక్ మార్చేలా వ్యవస్థను రూపొందించారు.

సీఎండీ సహకారంతో మిగిలిన సబ్‌స్టేషన్లలోనూ..

సీఎండీ మార్గదర్శకాలను అనుసరించి ఆటోమేషన్ సబ్‌స్టేషన్ నిర్వహణ విజయవంతంగా చేపట్టాం. దీనివల్ల సిబ్బంది వినియోగం తగ్గుతుంది. వారిని ఇతర పనులకు వినియోగించుకోవచ్చు. పనిభారం కూడా తగ్గుతుంది. వినియోగదారులకు సరఫరా లోపాల సమయం కూడా తగ్గింది. ఈ ప్రాంతంలో ఇప్పటికే అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ అందుబాటులోకి తీసుకొచ్చాం. అందుకే ఇక్కడ పైలట్ ప్రాజెక్టును చేపట్టాం. నగరంలో అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన ప్రాంతాల్లో ఉన్న సబ్‌స్టేషన్లలోనూ ఈ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సీఎండీ సలహాలు తీసుకుంటున్నాం. త్వరలోనే విశాఖ సర్కిల్ పరిధిలోని అన్ని సబ్‌స్టేషన్లలోనూ అమలు చేసేందుకు ప్రయత్నిస్తాం.



– ఎల్. మహేంద్రనాథ్, ఏపీఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ ఎస్ఈ

‘రెవెన్యూ’ ద్వారానే భూ వివాదాల పరిష్కారం


పట్టాదారులు,గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ రాజారావు

కొయ్యూరు: భూ వివాదాలను రెవెన్యూశాఖ ద్వారానే పరిష్కరించుకోవాలని ఎస్ఐ రాజారావు సూచించారు. నల్లగొండ పంచాయతీ కొప్పుకొండ నుంచి మంగళపాలెంకు వంతెన, రోడ్డు మంజూరైంది. మంగళపాలెం వరకు రోడ్డు వేస్తారన్న సమాచారం తెలియడంతో పట్టా భూములున్న పప్పుల బాలమ్మ, అరిమెల చినతల్లి, సత్యనారాయణ, గ్రామస్తులు కలిసి సోమవారం వంతెన నిర్మాణ ప్రాంతంలో ఆందోళన చేశారు. కొప్పుకొండ–మంగళపాలెం గ్రామాల మధ్య నాలుగు రోజులుగా వివాదం నెలకొంది. సమస్య పరిష్కారానికి ఎస్ఐ సోమవారం కొప్పుకొండ గ్రామస్తులు,పట్టాదారులతో మాట్లాడారు. పట్టా భూముల్లోంచి రోడ్డు నిర్మాణానికి అనుమతులు లేవని, వేస్తే అడ్డుకుంటామని పట్టాదారులు ఎస్ఐకు తెలిపారు. కనీస సమాచారం ఇవ్వకుండా జీడిచెట్లను వార్డు సభ్యురాలు రాజేశ్వరి తొలగించారని చెప్పారు. మంగళపాలెంకు చెందిన మరికొందరు గిరిజనేతర్లు కులం పేరిట దూషించి, బెదిరిస్తున్నారని తెలిపారు. అనంతరం ఎస్ఐ విలేకరులతో మాట్లాడుతూ పట్టాదారులు అనుమతి ఉంటేనే రోడ్డు వేసేందుకు వీలు కలుగుతుందన్నారు. సమస్యను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

బాపూజీ ఆశయ సాధనకు కృషి


పాడేరు ఐటీడీఏలో బాపూజీ, లాల్‌బహుదూర్ శాస్త్రీల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న పీఓ అభిషేక్


కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న జేసీ శివశ్రీనివాస్, డీఆర్వో అంబేద్కర్, ఇతర అధికారులు

అరకులోయ రూరల్: మహాత్మా గాంధీజీ కలలు అందరికీ ఆదర్శం కావాలని, బాపూజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలోని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో జరిగిన గాంధీ జయంతి వేడుకలో స్థానిక గిరిజన మ్యూజియం వద్ద ఉన్న మహాత్ముని విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడతూ బాపూజీ పోషించిన అహింసా మార్గం తర తరాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. యువత బాపూజీ మార్గాన్ని అనుసరించి, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సాక్షి, పాడేరు: జాతిపిత బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి తగ్గట్టుగానే రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహోన్నత పాలన అందిస్తున్నారని, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. పాడేరులో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకలో పార్టీ నాయకులతో కలిసి ఆమె మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ భారతదేశ స్వతంత్ర్య సంగ్రామంలో మహాత్మ గాంధీ పోషించిన పాత్ర చాలగొప్పదని, చరిత్రలో నిలిచిందన్నారు. గాంధీజి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడంలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు.గ్రామ స్వరాజ్యం గాంధీజీ ఆశయమని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామస్వరాజ్యం కోసం అంకితభావంతో పనిచేస్తున్నారన్నారు. గ్రామ సచివాలయాల వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, పాఠశాలల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన వంటి కార్యక్రమాలన్ని గ్రామ స్వరాజ్యంలో భాగమేనన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, జి.మాడుగుల వైస్ ఎంపీపీ కుడుముల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, డైరెక్టర్ లకే రామసత్యవతి, సర్పంచ్‌లు వనుగు బసవన్నదొర, వంతాల రాంబాబు, లకే పార్వతమ్మ, నీలకంఠం, ఎంపీటీసీ సభ్యులు సల్లా చిట్టమ్మ, రామకృష్ణపాత్రుడు, కుంతూరు సత్యనారాయణ, జిల్లా, మండల పార్టీ కార్యవర్గ ప్రతినిధులు సిరగం దశమూర్తి, పశుపుల సత్యనారాయణ, కన్నాపాత్రుడు, మోద బాబూరావు, సచివాలయాల కన్వీనర్లు వంతాల నరేష్, కోడా సుశీల, నాయకులు శివరాత్రి నాగేశ్వరరావు, రొబ్బి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: అహింసా ఆయుధంగా స్వాతంత్ర్యాన్ని తెచ్చిపెట్టిన మహనేత మహాత్మాగాంధీ చరిత్రలో ఎప్పటికీ నిలిచి ఉంటారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. ఎల్లవరంలో సోమవారం నిర్వహించిన గాంధీ జయంతి వేడుకలో ఎమ్మెల్యే ధనలక్ష్మి పాల్గొని మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అహింసా పోరాటంతో దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహనీయులు జాతిపిత గాంధీజీ అని కొనియాడారు. అడ్డతీగల సొసైటీ అధ్యక్షులు తోట రాజేశ్వరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ నక్కా మోహన్ తదితరులు పాల్గొన్నారు. అడ్డతీగలలో జరిగిన కార్యక్రమంలో సీఐ వై.రాంబాబు, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం సభ్యులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముంచంగిపుట్టు: మహాత్మ గాంధీ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఉమ్మడి జిల్లాల చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ అరిసెల సీతమ్మ ఆధ్వర్యంలో సోమవారం గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహానికి చైర్‌పర్సన్ సుభద్ర, విగ్రహ దాత ఎస్‌కె రెహమాన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ మహాత్ముని మార్గం అనుసరించాలన్నారు. వైస్ ఎంపీపీలు పి.సత్యనారాయణ, భాగ్యవతి, సర్పంచ్ సుభాష్ చంద్ర, ఎంఈవో కె.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాభివృద్ధిపై అవగాహన

అడ్డతీగల: వ్యవసాయాభివృద్ధిపై రైతులు అవగాహన పెంచుకోవడం అవసరమని రాష్ట్ర రోడ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల సత్యనారాయణ అన్నారు. రాయపల్లిలో సోమవారం వారాహ క్లైమేట్ ఆగ్ ఆధ్వర్యంలో గిరిజన మిత్రా స్వచ్ఛంద సంస్థ ద్వారా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల కారణంగా అతివృష్టి, అనావృష్టి సంభవించడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో మేలైన పద్ధతుల అనుసరించడం ద్వారా లాభపడడమే మంచిదన్నారు. అగ్రో ఫారెస్ట్రీ కార్బన్ ఫైనాన్స్ ప్రాజెక్ట్ ద్వారా గిరిజన రైతులు జీవనోపాధిని మెరుగుపరచడం ప్రధాన లక్ష్యమని గిరిజన మిత్రా ఫౌండేషన్ ఉదయ్ శ్రీనివాస్, వారాహ టీమ్ లీడర్ శివకుమార్ అన్నారు. రైతులకు ఈ ప్రాజెక్ట్ అదనపు ఆదాయ వనరుగా నగదు, మొక్కలు అందజేస్తోందన్నారు. సర్పంచ్ విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: గిరిజన రైతులు ఈ–క్రాప్ ద్వారా పంటల వివరాలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాబిన్ సుదర్శన్ చెప్పారు. మండలంలోని గుండాల, చింతలగూడెం, లక్ష్మీపురం గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించారు. ఈ–క్రాప్ నమోదుపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని ఏవో కోరారు.

రాజవొమ్మంగి: ప్రతి రైతు క్షేత్రంలో శాశ్వత ప్రాతిపదికన ద్రవ జీవామృతం తయారుచేసుకోవాలని రైతు సాధికార సంస్థ కొమరాపురం యూనిట్ ఎంసీఆర్పీ అప్పలరాజు సూచించారు. వాతంగిలో రామలక్ష్మి వరి పొలం వద్ద 500 లీటర్ల ద్రవజీవామృతాన్ని తయారు చేశారు. వాతంగి, లోదొడ్డి పంచాయతీలలోని రైతులకు ద్రవజీవామృతం విశిష్టతను తెలియజేశారు. ద్రవజీవామృతం వాడకం వల్ల భూమిలో సూక్ష్మజీవులు పెరిగి పంటకు అవసరమైన పోషకాలు అందుతాయన్నారు. దీని వాడకం వల్ల భూమి సారవంతంగా తయారవుతుందన్నారు. భూమిలో తేమ శాతం పెరుగుతుందన్నారు. ఐసీఆర్పీలు లోవరెడ్డి, శ్రీను, పాపారావు, సత్యన్నారాయణ, ఐబీ. ఐసీఆర్పీలు చిన్నారి. నూకరత్నం పాల్గొన్నారు.

బండారు.. ఖబడ్దార్

- ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్
- మంత్రి రోజాపై అసభ్యకర వ్యాఖ్యలపై నిరసన


నిరసన ర్యాలీలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితరులు

సింహాచలం: రాష్ట్ర మంత్రి ఆర్.కె. రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీమంత్రి బండారు సత్యనారాయణమూర్తిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి డిమాండ్ చేశారు. పెందుర్తి నియోజకవర్గ మహిళా నేతలు సోమవారం పెందుర్తి నాలుగు రోడ్ల కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ బండారు ఇంట్లో కూడా మహిళలు ఉన్నారని గుర్తించుకోవాలన్నారు. బండారు నోరు అదుపులో పెట్టుకోకపోతే మహిళలే బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. రాజకీయ విమర్శలు ఎన్నైనా చేసుకోవచ్చని, మహిళలపై నీచమైన వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. మహిళలంటే గౌరవం లేకుండా బండారు ప్రవర్తిస్తున్నారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు దృష్టిలో పడేందుకు ఇలాంటి నీచమైన వ్యాఖ్యలు చేశారన్నారు. టీడీపీకి, చంద్రబాబుకు కూడా మహిళలంటే గౌరవం లేదన్నారు. ఆడపిల్ల పుట్టుకనే చులకన చేసిన వ్యక్తి చంద్రబాబు అని, అలాంటి చంద్రబాబు వద్ద బండారు పనిచేస్తున్నారన్నారు. జెర్రిపోతులపాలెంలో మహిళపై జరిగిన దాడి విషయంలో ఆరోజే బండారుని ఇంట్లో ఆడవాళ్లు కొట్టి ఉంటే ఈరోజు ఇలాంటి వ్యాఖ్యలు చేసి ఉండేవారు కాదని తెలిపారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ బండారు సత్యనారాయణ పెందుర్తి నియోజకర్గ పరువు తీశారన్నారు. ప్రపంచంలో ఉన్న తెలుగువాళ్లంతా ఈరోజు బండారును అసహ్యించుకుంటు న్నారన్నారు. ఇరవై ఏళ్లు శాసనసభ్యుడుగా పనిచేశానని చెప్పుకునే బండారు సంస్కారం ఇదేనా అని ప్రశ్నించారు. కాల్‌మనీ, సెక్స్‌రాకెట్, మహిళా తహసీల్దార్ జుట్టుపట్టుకుని ఈడ్చుకొచ్చిన సంఘటనలు టీడీపీ పాలనలో చూశామన్నారు. మహిళలకు ఉన్నతస్థితి కల్పించే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారన్నారు. మహిళలను కించపరిచే విధంగా మాట్లాడితే పెందుర్తి నియోజకర్గ ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పెందుర్తి ఎంపీపీ నాగమణి, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నదియా తదితరులు పల్గొనఆనరు.